కథ

# దారికి రాని రాణి

మా ఆవిడ చాలా స్పీడు! ఈ విషయం నాకు పెళ్ళి చూపుల రోజునే స్పష్టంగా తెలిసిపోయింది. నా ముందు ప్లేట్లో, కాబోయే అత్తగారు పెట్టిన జీడిపప్పు పలుకులు నోట్లో వేసుకొందామను కొనేలోగానే అందాల మెరుపు తీగలా, లోపలి గదిలోంచి, చరచరావచ్చేసి, నా కళ్ళలోకి సూటిగా చూస్తూ ఎడమచేత్తో షేక్ హేండ్ ఇస్తూనే కుడిచేతిలోని వేడి వేడి కాఫీ కప్పుని, తన కాళ్ళతో నా కాళ్ళను ఉద్దేశపూర్వకంగా కాకపోవచ్చు గాని తాకుతూ, ఇచ్చి వెంటనే "ఊఁ తాగండి - ఎంగిలి చేయలేదు ఇది పాలగ్లాసుకాదు గదా!" అని తన జోకుకి తనే ఫకాల్న నవ్వింది - నేను తేరుకొనేలోగానే," మా నాన్న మీ కోసం స్వయంగా చేసిన మంచి సినిమా వంటి ఫిల్టర్ కాఫీ అని మరో సారి నవ్వింది. వెంటనే పక్కనే ఉన్న సింహాసనం లాంటి, తనకే రిజర్వు చేసి ఉంచబడి ముఖ్‌మల్ పరచిన అద్దె కుర్చీలో కూర్చుని, ఇంకేమీ జోకులు వేయకుండా నా ముందున్న జీడిపప్పు ప్లేటు లాక్కొని ఆ పలుకుల వేగంగా ఆరగించ సాగింది. కరకరలాడిస్తూ, నేనలాగే కొయ్యబారిపోయి ఉంటే గమనించి కాబోలు. మాటల్లో పెడదామని, తిండి కాస్త విరామ మిచ్చి అడిగింది "జానూ, మీ పేరు వెంకటప్పయ్యంట కదా - ఏం బాలేదు - ఇంకా నయం ఇంటిపేరు అల్లాటప్పాకాదు - ఇంతకీ ఇంటి పేరేంటి? అమ్మ చెప్పింది గాని మర్చిపోయా"- "వెంపటి...." నెమ్మదిగా గొణిగాను - కుంపటిలా ఉందని ఎద్దేవా చేస్తుందని భయపడుతూ......

"ఆ ఇది కొంత పర్వాలేదు -


- వెగొండి రామ జోగయ్య



వెంపటి వెంకట్  అని మార్చి ద్దాం మీ పేరు?" - తన ఎదసంపదను, ముత్యాలపలువరసను చూడ్డంలోనే పరవశంగా నిమగ్నమైపోయిన నేను ఏం మాట్లాడ లేకపోయేను - కొంచెం తేరుకోవడానికిగాను కింది చూపులు చూస్తే ఖాళీ అయిన జీడిపప్పు ప్లేటు కనపడింది. ఊసూరు మనిపించి పక్కకి చూపులు మరల్చాను. ఓ మూల చేతులు కట్టుకొని నిలబడి ఉన్న ఓ బక్క శాల్తీని చూసి కాబోయే మామ గారీయనే - కాఫీ పెట్టిచ్చింది కూడా ఈయనేనని, నిర్ధారణ చేసుకుని, కాఫీ తాగబోయి మూతి కాల్చుకొని మూలిగాను. దాంతో రాణి నామధేయురాలు, నా గుండెల్ని పిండేస్తున్న ఆ రూపసితో బాటు స్థూలకాయురాలైన, కాబోయే అత్తగారు కూడా పడీపడీ నవ్వసాగేరు తెరలు తెరలుగా - కాబోయే మావగారు మాత్రం ఎటో నిర్వేదంగా చూస్తూ మౌనంగా ఉండిపోవటం చూసి ఇంట్లో ఆయన స్థానమేమిటో బాగా అర్ధం చేసుకొన్నాను. ఆ ఇంటి పరిస్థితి ఆడపెత్తనమనీ తెలిసి పోయింది. ఈ సంబం ధం ఒప్పుకుంటే, మన సంగతీ అంతేనని కూడా అర్ధమై పోయింది - కాని పిల్ల బాగుంది కదా అన్న మధురభావం మన సులో తిష్ట వేసుకుని కదలటం లేదు - మధ్యవర్తి ముందే చెప్పి ఉంచిన కట్నం వివరాలు, ఆ మోజుని ద్విగుణీకృతం చేస్తోంటే ఏమీ ఇదమిద్ధంగా నిర్ణయించుకోలేక మౌనంగా ఉండి పోయాను  కూడా వచ్చిన మధ్యవర్తి, తన పని  అది మాత్రమేనన్నట్టు, టిఫిన్‌లు ఆరగించటంలోనే మునిగిపోయున్నాడు. నేనైనా కాస్తం తైనా అభి జాత్యం చూపించాలన్న పాడుకోరిక కలిగి సగం తాగిన కాఫీ కప్పుని బట్టమీద పెట్టేయ్ బోయి, కాబోయే అత్త గారు కాస్త తీక్షణంగా చూస్తుంటే, జడుసుకొని మిగిలిన కాఫీ కూడా గడగడా తాగేశాను. దాంతో ఆవి డ ప్రసన్నమైపోయి ఇంకో జీడిపప్పు ప్లేటు తెచ్చిస్తుందేమోనన్న చిన్ని ఆశ కలిగింది - కాని ఆవిడ కదలలేదు - అసలే స్థూలకాయురాలాయె!

"ఏదో మాట్లాడాలనిపించి నోరు విప్పేలోగా కాబోయే అత్తగారు ఆగమన్నట్టు చెయ్యూపి "నీకు వెనుక ముందు ఎవరూ లేరటగా - ఎక్కడో వేరే రూమ్‌లో ఉంటున్నావంట - అయితే కొంచెం వంట వచ్చే ఉంటుంది" వూ అమ్మాయికైతే రాదులే - దానికేం ఖర్మ -" ఈ సారి దర్జాగా కాళ్లు కూడా ఊపుకొంటూ ఖచ్చితంగా చెప్పేసింది.

ఆరగింపు కార్యక్రమం పూర్తయిపోయింది కాబోలు తను కలుగ చేసుకొన్నాడు మధ్యవర్తి - "బాగా వంట చేయడం రాకపోతే మావగారి దగ్గర కొన్నాళ్ళు శిక్షణ తీసుకొంటాడు కుర్రాడు - అదే మన్నా బ్రహ్మ విద్యా -



నేర్చుకోలేకపోవడానికి" - ఇంతకీతమరి నిర్ణయమేమిటో..." తల్లీ కూతుళ్లను మాత్రమే చూస్తూ అడి గేసేడు, నా నిర్ణయం పసిగట్టేసేడో, లేక అది అంత ప్రధానం కాద నుకొన్నాడో తెలియలేదు నాకు - అయినా, ఏదో దౌర్బల్యంతో, ఏమీ మాట్లాడలేకపోయాను. వాళ్లూ తమ నిర్ణయం అప్పడే చెప్పలేదు గాని, తల్లీ కూతుళ్ళు నా గురించి, ఉద్యోగం జీతం వంటి, వాటి గురించి ఎన్నో ప్రశ్నలు ఓ గంట సేపు అడిగితే అన్నింటికీ బహు వినయంగా జవాబిచ్చేను, మనసులో నాకే ఆశ్చర్యం గొలిపే రీతిలో - అంతలా పడిపోయేనన్నమాట ఆ రాణి అందచందాలకు.

ఆఖరికి, ఆ మహాతల్లీ, అదే కాబోయే అత్తగారు "మాకు సమ్మతమేనబ్బాయ్' అనటం రాణి కూడా "డిటో" అన్నట్లు మందస్మితంతో తలపంకించటం చూసి నేను ఉబ్బి తబ్బిబ్బై పోయాను. ఏనుగెక్కినంత సంబరపడి పోయాను. నాకు లభించిన వరానికి ఎలా కృతజ్ఞతలు చెప్పానో, ఏం వాగానో ఇప్పు డేమీ జ్ఞాపకం లేదు. ఆ విధంగా పెళ్లి చూపులు తతంగంలో నా దుర్బలత్వానికి, దాంపత్యంలో రాణి ఆదిపత్యానికి హైబ్రీడ్ బీజాలు పడ్డాయన్నమాట! అంతే తర్వాత రాణీ కున్నంత స్పీడు గా అన్ని పరిణామాలు జరిగిపోయాయి. నా ఖర్చే గాని, జోక్యం పెద్దగా లేకుండా పెళ్లీ జరిగిపోయింది పది రోజుల్లోపే - అయినా నా తరపున పెద్దగా చుట్టాల్లేనందున వాళ్ల అతి ప్రమేయం నాకేమీ తలవంపులు కలిగిచలేదు. తలంబ్రాలు పోసుకోవటం, బిందెలో ఉంగరాం వెతకటం గుమ్మం దగ్గర పేరు చెప్పటం ప్రధానంగా కాలు తొక్కటం వంటి అన్ని తతంగాల్లోను రాణి ఆధిపత్యం, నాకేగాదు పెళ్ళి కొచ్చిన వారందరికి స్పష్టమయి పోయినా నాకు బాధకలగలేదు. కాలు తొక్కిన విధమే కాపురం చేసే కళ తెలియజేస్తుందన్న సామెత మాత్రం నిజమైంది.

మెదటి రాత్రి, గది గడియ తానే వేసింది. పాలు తనే ముందు తాగి నాకు కొంచెమే ఉంచింది. తను మాట్లాడిన మొదటి మాట ఏమిటో తెలుసా?" ఇదిగో వెంకట్! అండీ కొండీ అనటం నాకి ష్టముండదు ఏమంటావ్" నేనేదో అనే లాగానే, గట్టిగా హత్తుకొని పోయి, ఏవో తెలియని కొత్త లోకాలకు ఎత్తుపోయింది. చిత్తయి పోయాను.

మెదటి రాత్రి, గది గడియ తానే వేసింది. పాలు తనే ముందు తాగి నాకు కొంచెమే ఉంచింది. తను మాట్లాడిన మొదటి మాట ఏమిటో తెలుసా?" ఇదిగో వెంకట్! అండీ కొండీ అనటం నాకి ష్టముండదు ఏమంటావ్" నేనేదో అనే లాగానే, గట్టిగా హత్తుకొని పోయి, ఏవో తెలియని కొత్త లోకాలకు ఎత్తుపోయింది. చిత్తయిపోయాను.

ఇక మొదటి నెల జీతం రాగానే, మొత్తం లాగేసుకుందని, ఆవిధంగా ఆర్థికపరమైన ఆధిపత్యం తీసేసుకుందని వేరే చెప్పాలా? వీటన్నింటిని నేను పెద్దగా పట్టించుకోలేదు గాని, వంటావార్పు మొత్తం నా మీదే పడిపోవటం మాత్రం అంతగా రుచించలేదు. ఈ దుస్థితిని కొన్ని నెలలు ఎలాగో భరించి, ఓ రోజు తెల్లవారు జామునే లేచి "ఏదో చేయాలి. ఈ జీవితంలో కొంతైనా ఆఖరికి వంటావార్పు డ్యూటీలోనైనా కొంత పరివర్తన తేవాలని నిశ్చయించుకొన్నాను. కాఫీ పెడుతూ, దీర్ఘంగా ఆలో చించగా చించగా తరుణోపాయం తోచింది. - ప్లాన్ క్రమంగా జాగ్రత్తగా అమలుపరచసాగేను.

వంట బాధ్యత నివారణ కార్యాచరణ ప్రణాళికలో తొలిమెట్టుగా ఓ సాయంత్రం వంట త్వరగా ముగించి, తను వింటుండగా నా కజిన్ ఒకడికి ఫోన్ చేసి మాట్లాడేను" ఒరేయ్ - ఏదో వంక పెట్టి నువ్వు మా పెళ్ళికి రాలేదు. ఓ సారి వచ్చి నా భార్య అందచం దాలు, గుణగణాలు చూసి నువ్వు కుళ్లుకోవాలని నా కోరిక - కాబట్టి ఈ ఆదివారం మా ఇంటికి మీ ఉభయులూ, పిల్లాడితో సహా మా ఇంటికి భోజనానికి రావాలి. మా ఆవిడ వంట ఎలా ఉంటుందోనని భయపడాల్సిన పనిలేదు ఎప్పటిలా నేనే వంట చేస్తాను. అన్నట్లు గిఫ్ట్ తేవటం మరచిపోకేం" సరే ఉంటాను...." ఇలా గడగడా చెప్పేసి ఫోను పెట్టగా 'రాణి' గుడ్లురుముతూ కనపడింది.

వంట ఎప్పుడూనేనే చేస్తాను మా ఆవిడ చెయ్యదు అని పనికట్టుకుని చెప్పాలా?" అని దులిపేస్తుందనుకొన్నాను. అబ్బే అదేం కాదు "ఏదో గిఫ్ట్ తెమ్మని చెప్పటమేమిటి? మాకు ఎలక్ట్రిక్ కుక్కర్ లేదు కష్టమవుతోంది అది తేరా" అని చెప్పి ఉండచ్చు గాదా అని దులిపింది. ఏదోఫారిన్‌లో ఉండొచ్చినట్టు, ఫారిన్‌లో తమకు కావల్సిన గిఫ్ట్ ఏదో స్పష్టంగా ముందే చెప్తారు - తెలుసా అని డబాయించింది అంతేగాని మొగుడే వంట చేస్తాడని ఇతరులకు కూడా తెలిసిపోతే ఎలా అని నామోషీ ఫీలయినట్లు మత్రం అనిపించక ఉసూరుమంది నా మనసు.

అయినా, నిరుత్సాహం చంపుకొని నా ప్రణాళిక పకడ్బందీగా అమలుపరచసాగేను. ఆ ఆదివారం పొద్దున్న పాలవాడు బెల్ కొట్టినపుడు, ఇది వరకటి తలుపు చాటున నిలబడి, గిన్నెతోసి, గుట్టుగా తీసుకోకుండా బహిరంగా దర్జాగా బయటికి వెళ్ళి పాలు పోయించుకొని, వాడిని కబుర్లలో పెట్టేను, పక్కిళ్ళ వాళ్ళకి విని పించేంత గట్టిగా.

"ఏవోయ్ నువ్వు పొద్దున్నే ఇలా పాల పంపిణి కార్యక్రమానికి వచ్చేస్తావు గదా, కాఫీ గట్రా మీ ఆవిడే పెట్టుకోవాలా నిద్రాభం గంచేసుకొని, లేక మీ నాన్న ఉన్నాడా ఆ పని చేయడానికి? ఇంకా ఇతర ఇంటిపనులు, అదే.. వంటా వార్పూ మీ ఇంట్లో ఎవరు చేస్తారు, నువ్విలా వచ్చేస్తే. నువ్వు తిరిగి వెళ్ళేకనే చేస్తావా? అన్నిళ్లలో పాలు పోసిపోయే సరికి వంటకు లేటయిపోదా? మీ పిల్లలకి స్నానాలెవరు చేయిస్తారు? ఇలా ప్రశ్నల వర్షం కురిపించేసరికి, పాలవాడు బిత్తరపోయి, తన తుండు గుడ్డ కూడా కంగారులో మా గుమ్మం దగ్గిరే వదిలేసి పారిపోయాడు! అయితే నేను ఆశించిన ఫ లితం దక్కింది. పక్కింటి మీనాక్షమ్మగారు అంతా స్పష్టంగా విని ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ లోపలికి వెళ్లిపోయింది!!

అవిడసలే బి.బి.సి అని మా ఆవిడోసారి చెప్పింది. కాబట్టి మా ఇంటి సమాచారం సాయంత్రంలోగా కనీసం వీధిలో వాళ్ళం దరికీ తెలిసపోతుందన్న ఆశ కలిగింది. వంటింట్లోకి వెళ్లబోతూ, పడగ్గదిలోకి తొంగి చూశాను. నా ఈ వాగుడంతా విన్నదన డానికి నిదర్శనంగా మా ఆవిడ దుప్పటికింద అసహనంగా కదలటం చూసి సంతృప్తిగా తలపంకించాను.

హుషారుగా ఈల వేసుకొంటూ, వంటింట్లోకి వెళ్ళి ఉల్లిపాయలు తరుగుతుంటే ఆనంద భాష్పాలొచ్చేయి! కాసేపటికి రాణి లేచిన శబ్దమైతే, ఒక్కక్షణం - కాఫీతెస్తున్నాను అని గట్టిగా అరిచేను పక్కవాటాల వాళ్ళకి కూడా వినపడేలా. ఇచ్చిన కాఫీ తాగుతూ "ఇంత దగ్గరిలో ఉండి కూడా, అంతలా అరవటమెం దుకు అని మెల్లగా గొణికింది. నేను విజయగర్వంతో వంటింట్లోకి వెళ్ళిపోయాను.

మళ్ళీ అక్కడ్నించే అరిచేను." ఈ వేళ అతిధులొస్తున్నారు గదా - "ఫ్రైడ్‌రైస్ చేస్తున్నాను - బంగాళ దుంపకుర్మా కూడా - ఔనూ బెండకాయలు మరీ లేతగా లేవు - వేపుడు చేయనా? పులుసా? బాత్రూంలో ఉందనుకొంటూ, ఏమీ సమాధానం చెప్పలేదు-



తర్వాత కూడా వంట పూర్తయే వరకు - నా పులుసయి పోయింది- నీ సీరియలైపోయిందా - అరటికాయ ఆవపెట్టనా - ఇగురు మొన్న కుదరలేదన్నావు కదా! లలల్లా...లేచింది మహిళా లోకం, దద్దరిల్లింది పురుష ప్రపంచం...నలభీమపాకం, ఆడోళ్లకు రాదే మాలోకం - ఇలా అర్థం పర్థం లేకుండా ఆడుతూ పాడుతూ పక్కవాటాల వాళ్లకి కూడా వినపడేలా అరుస్తూ వంట పూర్తి చేశాను. అక్కడికీ, అర్ధాంగి, "అబ్బా గట్టిగా అరవొద్దు నాకు టీవీ వినిపించటం లేదని " హల్లోంచి గద్దించినా, లెక్క చేయ లేదు తనే, టీవీ వాల్యూమ్ పెంచుకొందిగాని మరీ కోప్పడలేదెం దుకనో! నా మాటలు పాటలు పక్కవాటాల వాళ్ళు చక్కగా విని ఉంటారన్న నమ్మకం కలిగింది.

కజిన్, మిత్రుడు రవి కుటుంబంతో సహా, అంటే భార్య రమణి, పుత్రరత్నం అయిదేళ్ళవాడు ప్రవీణ్‌లతో 12గంటలకి వచ్చేసరికి, మా రాణి చక్కగా స్నానం చేసి జరీపట్టుచీర కట్టుకుని దర్జాగా సోఫాలో కూర్చుని, ఇంకో సీరియల్ చూస్తూ ఉంది. నేను మాత్రం పని అవ్వనట్లుగా నాటక మాడుతూ, వంటింట్లోనే ఉండిపోయాను. రవి వచ్చి బెల్ కొట్టేసరికి, కావాలనే మసి పూసుకొన్న లుంగీతో చిల్లుల బనీన్‌తో వెళ్లి తలుపుతీశాను. వాళ్లని నేనే అలా రిసీవ్ చేసుకుంటుంటే, రవి భార్య రమణి నా అవతారం కేసి, దర్జాగా జరీ చీరలో ఉన్న రాణి కేసి మార్చి మార్చి చూసింది. నేనదేం పట్టించుకోకుండా "ఇప్పుడే వంట పూర్తి చేశాను. రండి... లోపలికి రండి... అని ఆహ్వానించాను. "రాణీ వీళ్ళే మా రవి, రమణి - వీడు వాళ్ల పుత్రరత్నం ప్రవీణ్ అని పరిచయ కార్యక్రమం పూర్తి చేసి, రాణీ రమణితో మాట్లాడుతూండు. నేను వెళ్లి స్నానం చేసి వస్తాను అంటూ లోపలికి పరిగెత్తాను.

వెళ్తూండగా ప్రవీణ్‌గాడు, ఆంటీ మీ ఇంట్లో అంకులే వంట చేస్తారా? అని మా ఆవిడ్నే ధైర్యంగా అడిగేయటం వినపడి చాలా ఆనందించాను. రాణి ఏదో గొణిగింది గాని, అది నాకు వినపడ లేదు. 'సరేలే' అనుకుని బాత్రూంలోకి దూరిపోయాను. అంతా నేను రవికి రమణికి ముందే రహస్యంగా చెప్పి ఉంచినట్లే జరుగుతోందన్న విశ్వాసం కలిగింది.

స్నానం తొందరగానే, ముగించుకొనొచ్చి, రండి...భోజనానికి కూర్చోండి. రాణీ! నువ్వు కూడా కూర్చో. నేను వడ్డిస్తా కదా" అన్నా.

"అదేంటన్నయ్యగారూ! వంట ఎలానూ మీరే చేశానంటు న్నారు, వడ్డన పని కూడా మీకెందుకు, ఆడవాళ్లమిద్దరం ఉండగా ! ఏమంటారు రాణిగారూ".

రమణి మాటలకు రాణీ ఏమనలేదు - రవే అందరం ఒక్కసారే కూర్చుందాం. కబుర్లు చెప్పుకుంటూ ఎవళ్ళకి వాళ్లే వడ్డించు కుందాం. ప్రపోజల్ నచ్చినట్లు మందహాసం చేసింది. అందరం తింటుండగా నేనే ఎక్కువగా లొడలొడా వాగుతూనే ఉన్నాను. చేసిన వంటకాల గురించి, పని మనిషి రానప్పుడు అంట్లు కూడా దాని కన్న తెల్లగా తోముతానని సందర్భం లేకపోయినా డబ్బా కొట్టుకున్నాను. వాకిట్లో ముగ్గులు పెట్టటం కూడా త్వరలో నేర్చు కొని ఆ లోటు కూడా లేకుండా చేస్తానని వాగాను.

రమణిని కొన్ని శాంపుల్ ముగ్గులు డ్రాయింగ్ లేసి పంపమని అభ్యర్థించాను. రాణి ఏం మాట్లాడలేదు గాని, వాళ్లు చూడన ప్పుడు నాకేసి గుడ్లురిమి చూడటాన్ని గమనించనట్టు నటిం చాను. రమణి కూడా ఏం మాట్లాడకుండా భోజనం చేయటాన్ని గమ నించి రవిని గిల్లేను ఎవరూ చూడకుండా. వాడు వాళ్లబ్బాయిని గిల్లేడు. దాంతో చిచ్చరపిడుగు అందుకొన్నాడు.

"నాన్నా - అంకులే వంట చేయటం, ముగ్గులు కూడా నేర్చు కొంటాననటం చాలా విచిత్రంగా ఉంది కదా! ఇలాంటోళ్లనేనా ఆడంగోళ్లు అంటారు? అమాయకంగా అడిగాడు. వాళ్ల అమ్మ నాన్న 'హుష్ - తప్పు అని హెచ్చరించలేదు!

సరే భోజనాలయ్యాక, నేనే తాంబూలాలు చుట్టి అతిథులతో సహా రాణికి ఇచ్చి నేనోటి లాగించాను. వెళ్తూ వెళ్తూ ముందే మేం నిర్ణయించుకొన్న విధంగానే రమణి అంది నువ్వు అదృష్ట వంతురాలివక్కా ఇలాంటి భర్తలభించినందుకు - కాని ఏ పనీ లేక లావయిపోతున్నట్లున్నావు కాస్త జాగ్రత్త పడక్కా. అక్కా అక్కా అని నొక్కి పలికింది తానే పెద్దదానినని తెలిసి కూడా, రాణి స్థూలకాయాన్ని పరోక్షంగా వెక్కిరిస్తూ! వెంటనే చిచ్చర పిడుగుగాడు కూడా అందుకున్నాడు. వంట చేసే మగాళ్ళని ఆడంగొళ్ళు అంటారు. ఏ పనీ చేయకుండా లావయ్యే ఆంటీలనే మంటారమ్మా" అంటూ. వాణ్ని మాత్రం వారించకుండా తల్లీ దండ్రులిద్దరు ముసి ముసి నవ్వులు నవ్వుకుంటూ బయటికెళ్ళిపోయి ఒక ఆటోని పిలిచారు . ఆటోలోంచి తొంగిచూస్తూ రమణి మళ్లీ వస్తానక్కా అంటూ చెయ్యూపింది -

రాణి ముఖం, తిరగేయటం ఆలస్యమయిన పెసరట్టులా నల్లగా మాడింది! ఏడ్వలేక నవ్వుతూ వాళ్ళని సాగనంపింది గుమ్మం లోంచే - తర్వాత నాతో ఏమీ మాట్లాడకుండా టీవీ పెట్టుకోకుండా సోఫాలో కూర్చుని దీర్ఘాలోచనలో మునిగిపోయింది.

నా ప్లాన్ విజయవంతమయింది - రాణిలో పరివర్తన మొదలైంది ఏ ఆడదీ మొగుణ్ణి ఆడంగి అను కోవటం సహించలేదు అని ఊహిం చాను. నాకిక వంటింటి డ్యూటీ క్రమంగానైనా తప్పిపోతుంది, తను త్వరలో వంట నేర్చేసుకొంటుందని ఆశించాను.

కాని నా ఆశ వమ్ము అయింది. - మర్నాడు పొద్దున్న ఎప్పట్లానే ఏకవచనంలో "ఈ రోజు సెలవు పెట్టు" అని క్లుప్తంగా ఆదేశించింది. నా దగ్గరే ఒక్క రోజులోనే వంట నేర్చుకుందామన్న ఉద్దేశ్యమేమో అనుకొన్నాను. నేనేదో అనే లోగానే తనే చెప్పింది -

"ఈ రోజు మనం ఇల్లు మారుతున్నాం - మా అమ్మ వాళ్లింటికి మారుతున్నాం సామానక్కి లారీ మాట్లాడిరా.

ఎందుకు! అలా.. అర్ధాంతరంగా... అయోమయంగా గొణిగాను. ఈ సారి వివరంగా చెప్పింది మా ఆవిడ రాణి -

"ఎందుకంటే... మా వాళ్ల ఇల్లు మనందరికీ సరిపోయేంత పెద్దది. వాళ్ళకి నేనొక్కదాన్నేకదా! కలిసుండొచ్చు. పైగా "మా ఇల్లు" ఊరికి దూరంగా విడిగా ఉంది. ఇక్కడిలా పక్కపక్క వాటాలోళ్ళు మనింట్లో ఏం జరుగుతోందోనని ఆసక్తిగా చూసే వాళ్ళు, నీ పాడు పాటలు, వాగుళ్ళు విని చెవులు కొరుక్కునే వాళ్లుండరు. ఇంటి గుట్టు ఇంట్లోనే ఉంటుంది. ఇల్లు దూరం బట్టి, మీ రవీ, రమణీలాంటి పనికి మాలినోళ్ళు పిలిచినా భోజ నానికి రారు. నీకూ వంటలో మా నాన్న సాయం ఉంటుంది...

"మరి... మరి నీకు అస్సలు ఎక్సర్ సైజు లేకపోతే...."

"సంతోషించాంలే నీ తెలివికి ... ఆ చుప్పనాతి రమణి అక్కా అని పిలిచినంత మాత్రాన నేను లావుపాటి దాన్నా? అయినా మా ఇంటి ముందు పెద్దతోట ఉంది కదా! నేనా తోటలో వాకింగుచేయొచ్చు. నువ్వు కూరగాయలు పండించొచ్చు. ఇంకా నిలబడి ఉన్నావేం! వెళ్ళి లారీ తీసుకురా సరిగ్గా బేరమాడి... ఇంకేం మాట్లాడేదిలేదన్నట్లు తల తిప్పేసుకొంది. ఇంకేం చేస్తాను రాణి ఆదేశాలు పాటించటం తప్ప - ఇదండీ దారికి రాని మా రాణి ధోరణి!!!